క్లుప్తంగా

చదరంగంలో విద్యార్థి ప్రతిభ



హర్షితను అభినందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండలంలోని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ చదువుతున్న విద్యార్థి హర్షిత జెఎన్‌టీయూ చదరంగం టీంకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 28న నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన జెఎన్‌టీయూ అంతరాష్ట్ర చదరంగం ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపడంతో హర్షిత ఎంపికైందన్నారు. నవంబర్‌లో తమిళనాడులో జరిగే అంతరాష్ట్ర చదరంగం పోటీల్లో పాల్గొటుందన్నారు. హర్షితను కళాశాల ఎండీ శివరాం, హెచ్‌ఓడీ మల్లికార్జునరావు, పీడీ చంద్రారెడ్డి అభినందించారు.

వేలంలో పెరిగిన ఆదాయం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర క్షేత్రంలో తాత్కాలిక అంగళ్ల నిర్వహించుకునేందుకు నిర్వహించిన వేలంలో గతేడాది కంటే ఈ ఏడాది ఆదాయం పెరిగినట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి, చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన టెంకాయల అంగడి వేలానికి గతేడాది రూ.2 లక్షలు రాగా ఈ ఏడాది రూ.2,04,000 పలికింది. అదేవిధంగా మిఠాయి అంగడి నిర్వహణకు గతేడాది రూ.26 వేలు పాడగా ప్రస్తుతం రూ. 26,400లకు పాడారు. మొత్తమీద ఏడాది కంటే ఈ ఏడాది రూ.8 వేలు ఆదాయం పెరిగిందని ఈఓ చెప్పారు. కార్యక్రమంలో పర్యవేక్షాధికారి శశికుమార్, ధర్మకర్తలుశివుడు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పాణ్యం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి సోమవారం తెలిపారు. ఉదయం 11గంటలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

మండల పరిధిలోని నేడు బలపనూరు గ్రామంలో మంగళవారం ఉదయం 8గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై అడిగి తెలుసుకుంటారన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలన్నారు.

నేడు దుర్వేశిలో ఆరోగ్య సురక్ష క్యాంపు

గడివేముల: మండల పరిధిలోని దుర్వేశి ఎంపీయూపీ స్కూల్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, డాక్టర్ మొల్లా జబీన్ సోమవారం తెలిపారు. ఇప్పటికే సచివాలయ పరిధిలోని కుటుంబాలకు ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన పరీక్షల కోసం టోకెన్లను అందజేశామన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీస్ అమరవీరుల సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సీఐ మన్సూరుద్దీన్

కోడుమూరు రూరల్ : విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి మరణించిన పోలీస్ అమరవీరుల సేవలు మరువలేనివని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోలీస్ సేవలపై ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా పోలీసులు రాత్రి పగలు తేడా లేకుండా ప్రజల రక్షణ కోసం, దేశ, ప్రజా సంపదను కాపాడుతూ పనిచేస్తున్నారన్నారు.

సుంకేసులలో 0.531 టీఎంసీల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపివేసినట్లు సోమవారం డ్యాం అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.531 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సారా విక్రేత అరెస్ట్

గడివేముల: మండల పరిధిలోని ఎల్‌కేతండా గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఇస్లావత్ సుభాష్ నాయక్ నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సంక్షేమ పథకాలతో పేదల ఇంట వెలుగులు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పర్ల గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేదల కుటుంబాల్లో వెలుగులు నిండాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పర్ల గ్రామంలో సర్పంచ్ హనుమక్క, ఎంపీటీసీ అశోక్ వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామ నాయకులు సుంకన్న, శేఖర్‌రెడ్డి, హరి, మల్లికార్జున, శ్రీధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని సంతోషంగా ఎమ్మెల్యేకు తెలియజేశారు.





మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ,వైద్య శిబిరంలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అర్హతే ప్రమాణికంగా పథకాలు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చారన్నారు. పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతా లో జమ చేస్తున్నామని చెప్పారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను గమనించా లని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, నాయకులు ఉలిందకొండ రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సత్యంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యం

కల్లూరు: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 28వ వార్డులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. వైద్య శిబిరంలో ఐసీడీఎస్ పౌష్టికాహార స్టాళ్లను, అందిస్తున్న సేవల గురించి శిబిరాని వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. శిబిరంలో మలేరియా, డెంగీ, మధుమేహం, బీపీ, గళ్ల, కంటి, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారని చెప్పారు. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, బాబు, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



లాలుషావలి సతీమణికి నగదును అందిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(అర్బన్): అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఆయన బ్యాచ్ (1998)కు చెందిన సహచర కానిస్టేబుళ్లు నగదును అందించి మానవత్వం చాటుకున్నారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వుడులో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న లాలుషావలి (ఏఆర్ పీసీ 1723) ఈ ఏడాది అక్టోబర్ 9వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. తమ సహచరుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు 1998 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు తమ వంతు సహాయంగా రూ.1.10 లక్షల నగదును జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా మృతుడి సతీమణి షాహినికి అందించారు. సోమవారం స్థానిక ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఐ వీఎస్ రమణ, 1998 బ్యాచ్ పోలీసులు పాల్గొన్నారు.

కరాటే పోటీల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య

కల్లూరు: కర్నూలు నగరంలో డిసెంబర్ 3న నిర్వహి ంచే దక్షిణాది రాష్ట్రాల ఓపెన్ కరాటే ఛాంపియన్‌షి ప్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను నగర మేయర్ బీవై రామయ్య సోమవారం ఆవిష్కరించా రు. మేయర్ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, కరాటే వల్ల శారీరక ధృఢత్వం పెరుగుతుందన్నారు. పోటీలు కర్నూలు నగరంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో జరుగుతాయని ఏ.బి. కరాటే అకాడమీ అధినేత జె.ఫయాజ్ తెలిపారు. అన్ని కేటగిరీల క్రీడాకారులు పాల్గొవచ్చున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ నెం 88858 71795 సంప్రదించవచ్చన్నారు.

సురక్ష శిబిరాలతో పేదల ఆరోగ్యానికి భరోసా



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్



ప్రజలకు రక్త, షుగర్ పరీక్షలతో పాటు బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం కర్నూలు మండల పరిధిలోని నూతనపల్లెలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యులు దాదాబాషా, విజయకృష్ణారెడ్డి, విజయమాధురి తదితరులు హాజరై వైద్య శిబిరానికి వచ్చిన 282 మందికి వైద్య సేవలు అందించారు. 38 మందికి బీపీ చెకప్ చేశారు. 41 మందికి షుగర్, 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 12 గర్భిణులు వైద్య సేవలు పొందారు. 18 మందికి కళ్లద్దాలతో పాటు అవసరమైన వారికి ఎమ్మెల్యే సుధాకర్ చేతుల మీదుగా డాక్టర్లు మందులను పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సల కోసం కొందరిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. అందుకే ఆరోగ్యశ్రీని బలోపేతం చేసి పలు వ్యాధులను అందులోకి తెచ్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గ్రామాలకే వైద్యులను పంపి వైద్యసేవలు అందించారన్నారు. ఇప్పుడు ఏకంగా ఆరోగ్య ఇబ్బందిని ఇంటింటికి పంపి ప్రతిఒక్కరి ఆరోగ్యస్థితిని తెలుసుకుని వైద్యం అవసరమైన వారికి ప్రత్యేక వైద్యులతో చికిత్స అందిస్తున్నారన్నారు. ఇలాంటి గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

అభివృద్ధికి అడుగడుగునా అడ్డు

ప్రతిపక్ష పార్టీల నాయకులు అభివృద్ధికి అడుగడుగునా అడ్డు తగులుతున్నారని ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పేదలకు గృహాలు ఇచ్చేందుకు యత్నించగా టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లి కాలయాపన చేసిన విషయం మనందరికీ తెలుసన్నారు. నూతనపల్లెలో కూడా ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి సర్పంచ్‌గా గెలిచిన వ్యక్తి గ్రామాభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. గ్రామానికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసినా పంచాయతీ తీర్మానం ఇవ్వడం లేదన్నారు. అయినా నూతనపల్లె గ్రామంలో సిమెంట్ రోడ్లు, పైపులైన్ ఏర్పాటు చేశామన్నారు. మరింత అభివృద్ధి చేయాలని ఉన్నా సర్పంచ్ అడ్డుగా మారారన్నారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి కూడా ఆయన స్వగ్రామం ఎదురూరులోనూ ఎలాంటి అభివృద్ధి చేయనివ్వడం లేదన్నారు. ఇవన్నీ గమనించి వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి నిరోధకులకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్నకుమార్, సింగిల్ విండో చైర్మన్ శేషిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహబూబ్‌బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, ఎంపీటీసీ కృష్ణ, ఈఓఆర్‌డీ అనురాధ, డిప్యూటీ తహసీల్దారు భాను, పంచాయతీ కార్యదర్శి హేమంత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలను త్వరగా పరిష్కరించాలి

కోడుమూరు రూరల్: స్పందనలో స్వీకరించిన అర్జీలను త్వరగా తహసీల్దార్ జయన్న అధికారులకు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలపై గ్రామాల్లోని రైతుల నుంచి వచ్చే అర్జీలను సంబంధిత వీఆర్వోలు పరిశీలించి ఆయా రైతులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని స్పందన కార్యక్రమంలో అధికారులకు అర్జీలు ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని గుండ్రేవుల, ఇనగండ్ల, బురాన్‌దొడ్డి, సి.బెళగల్, కొండాపురం గ్రామాలకు చెందిన రైతులు భూ రీ సర్వేలో భాగంగా తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణికి అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

స్పందన అర్జీలపై వెంటనే స్పందించాలి

గూడూరు: స్పందనలో వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించాలని తహసీల్దార్ వెంకటరమణ ఆదేశించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకూడదన్నారు. తమ పరిధిలో లేని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ మాధవీలత, వైకేపీ ఏపీఎం సుధాకర్ గౌడ్, ఎంఈఓ సునీలమ్మ పాల్గొన్నారు.

ముగిసిన మేరీమాత మాసోత్సవాలు

ఓర్వకల్లు : సకల జనుల మాతగా పిలువబడుతున్న మండల కేంద్రంలో వెలసిన మేరీమాత క్రైస్తవుల దివ్యమాతగా ప్రసిద్ధిగాంచింది. ఓర్వకల్లులో సకల జనుల మాత మాసోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. స్థానిక ఆర్‌సీఎం సంఘస్తుల ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించిన ఇంటింటి జపమాల మాసోత్సవాలకు కర్నూలు మేత్రాసన పరిపాలనాధికారి రెవ.మోన్‌సిగ్నోర్ ఎ.చౌరప్ప, రెవ.ఫా జోజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సాయంత్రం 7 గంటలకు స్థానిక విచారణ గురువులు రెవ.ఫా.ఆనందరాజు ఆధ్వర్యంలో అమ్మవారి స్వరూపానికి ఊరేగింపు నిర్వహించారు. స్థానిక బాలయేసు దేవాలయం (పాత చర్చి) నుంచి కొత్త చర్చి వరకు క్రైస్తవ యువతీ యువకులు కొవ్వొత్తులు చేతపట్టి శాంతియుత ప్రదర్శన చేపట్టారు. అనంతరం పలువురు విచారణ గురువులు వ్యాఖ్యోపదేశం చేశారు. దివ్యబలి పూజ అనంతరం బైబిల్ సందేశాలను వినిపించారు. అనంతరం భక్తులకు విందు భోజనం ఏర్పాటు చేశారు.



అమ్మవారి స్వరూపాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మోదీ పాలనలో పేదలకు ఇబ్బందులు

- మోదీ పాలనలో అంబాని, అదానీలకే మంచిరోజులు
- పేదోడు కూడు, గూడుకోసం వెంపార్లాడుతున్నాడు
- కర్నూలులో నిర్వహించిన బహిరంగ సభలో ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ దవాలే



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ దవాలే

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో పేదలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ దవాలే అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అంబానీ, అదానీలకే మంచి రోజులు వచ్చాయని, వారి ఆస్తులు ఏడాదికేడాదికి రెట్టింపు అవుతూ పోతున్నాయని విమర్శించారు. ఆపార్టీ ఆధ్వర్యంలో అసమానతలు లేని అభివృద్ధి కోసం అంటూ చేపట్టిన ప్రజా రక్ష భేరీ బస్సుయాత్రను సోమవారం ఉదయం ఆదోనిలో ఆయనతో పాటు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు,మాజీ ఎమ్మెల్యే గఫూర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సాయంత్రం ఆరు గంటలకు బస్సు యాత్ర కర్నూలు నగరానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. అచ్చేదిన్ పేరుతో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వంలో పేదలు కూడు, గూడు కోసం వెంపర్లాడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి రాకమునుపు రూ.400 ఉన్న సిలిండర్ నేడు రూ.1100కు చేరుకుందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ పరం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ప్రధాని యువతను మోసం చేశారన్నారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం చేపట్టిన బస్సు యాత్రను ప్రజలు ఆదరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సీపీఎంను బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎన్నుకుంటే రూ.400లకే గ్యాస్ సిలిండర్, రూ.60లకే పెట్రోల్, ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కును పరిరక్షిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ రాష్ట్ర నాయకులు పి.నిర్మల, కె.ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

గూడూరు : మండలంలోని మునుగాల గ్రామానికి చెందిన బి.నాయుడు(27) ఆదివారం రాత్రి పట్టణ సమీపంలో డంప్ యార్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ విక్టరిబాబు సోమవారం తెలిపారు. గూడూరులోని అతని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడి భార్య పుష్పావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

చిన్నారులతో పని చేయిస్తే చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): చిన్నారులు, బడి ఈడు పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న అన్నారు. సోమవారం స్థానిక ధర్మపేటలోని తమ కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని చెప్పారు. ఈ నేపథ్యంలో పిల్లల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ముఖ్యంగా వారికి పనులకు పంపకుండా స్కూలుకు సక్రమంగా పంపేలా చూడాలని, బాల్య వివాహాలు, చిన్నారుల అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

- నలుగురికి గాయాలు

కోడుమూరు రూరల్: హైదరాబాద్ నుంచి ఆదోని వైపు వెళ్తున్న కారు కోడుమూరు సమీపంలో సోమవారం అడ్డుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి పక్కనున్న పొలాల్లో బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన అక్షయజైన్, రాముతో పాటు, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కోడుమూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

1,2 తేదీల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు (న్యూసిటీ) : వచ్చే నెల ఒకటి, రెండో తేదీల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని నగర పాలక కమిషనర్ భార్గవతేజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక బళ్లారి చౌరస్తా సమీపంలోని ఇంటర్‌నేషనల్ ఫంక్షన్ హాల్ వద్ద 300 ఎంఎం డయా ఏసీ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతో నగరంలోని ఎన్టీఆర్ కాలనీ, వీకర్‌సెక్షన్ కాలనీ, రమణ బంకు లైన్, విష్ణు టౌన్‌షిప్, ఎల్కూరు ఎస్టేట్, వసుంధర అపార్ట్‌మెంట్, ప్రియా హోమ్స్, వెంగేశ్వర నగర్, నాగేంద్ర నగర్, పరిమళ నగర్, కృష్ణా రెడ్డి నగర్, గణేష్ నగర్, నిర్మల్ నగర్, బృందావ న నగర్,అయ్యన్న నగర్, రామలింగేశ్వర నగర్, బాబా బృందవన నగర్, రాజీవ్ నగర్, వీనస్ కాలనీ, ఆటో నగర్‌లలో రెండు రోజులపాటు మంచినీటి సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

ఉండుట్లలో పల్లెనిద్ర



ఉండుట్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

గడివేముల: మండల పరిధిలోని ఒండుట్ల గ్రామంలో ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య సోమవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఎస్ఐ గ్రామానికి చేరుకుని ప్రజలతో సమావేశమయ్యారు. ఎస్ఐ మాట్లాడుతూ వివాదాలకు తావులేకుండా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలన్నారు. చోరీలు, జూదం, మట్కా, నాటుసారా తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, చెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కర్నూలు (న్యూసిటీ) : నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నంద్యాల అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్‌మాన్ పి.సంజీవరాయుడు కుటుంబానికి ఆ శాఖ ఉద్యోగులు అండగా నిలబడ్డారు. రూ. 5,37,016 సేకరించి సోమవారం సంజీవరాయుడు తల్లిదండ్రులు, భార్య పిల్లలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగో జోన్ రీజినల్ ఫైర్ ఆఫీసర్ ఎం.భూపాల్ రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ ఆర్గనైజేషన్ కార్యదర్శి శివరామిరెడ్డి, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.మహేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.ప్రతాప్, జిల్లా మాజీ అధ్యక్షుడు రామాంజనేయులు, ట్రెజరర్ సోము నాయక్, అనంతపురం జిల్లా కార్యదర్శి అవినాష్, కర్నూలు లీడింగ్ ఫైర్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

కర్నూలు (న్యూసిటీ) : మహిళలకు వెంటాడుతున్న రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరమని రాయలసీమ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎ.ఆనందరావు అన్నారు. ఆ వర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను ముందే గుర్తించి పరిష్కరించుకోవాలని చెప్పారు. దైనందిన జీవితంలో మారిన ఆహార అలవాట్లతో చిన్న వయస్సు వారు సైతం క్యాన్సర్ బారీన పడుతున్నారని తెలిపారు. మహిళలు ఆకుకూరలు, పోషకాలు ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, రోజూ వ్యాయామం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ గంధం అరుణ, డాక్టర్ రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ ఆనందరావు

మహిళలే కింగ్ మేకర్లు

- నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం
- మొత్తం ఓటర్లు 3,08,035
- ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

గడివేముల: అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓట్లు కీలకం కానున్నాయి. గత ఎన్నికల కంటే ఈ సారి మహిళా ఓటర్ల సంఖ్య పెరిగింది. వారు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో ఆ పార్టీ నాయకులకే విజయావకాశాలు ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు.

మహిళా ఓటర్లు 1,57,064 మంది

పాణ్యం నియోజకవర్గంలో 3,08,035 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,50,895, మహిళలు 1,57,064 ఉండగా 76 మంది ఇతరులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పురుషుల కంటే మహిళలు 6,169 మంది ఎక్కువగా ఉన్నారు. ప్రచురించిన ముసాయిదా జాబితా ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రదర్శించారు. జాబితాపై అభ్యంతరాలుంటే సంబంధిత బీఎల్‌ఓలు లేదా రెవెన్యూ అధికారులను సంప్రదించాలి.

డిసెంబర్ 9 వరకు మార్పులు, చేర్పులకు అవకాశం

ప్రచురించిన ఓటరు ఓటరు జాబితాలో అభ్యంతరాలకు డిసెంబర్ 9వ తేదీ వరకు అవకాశం కల్పించారు. చేర్పు లు, మార్పులకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు అభ్యంతరాలకు సమర్పించుకునే అవకాశం ఉంది. క్లెయిములను డిసెంబర్ 26లోగా పరిష్కరించి 2024 జనవరి 5న తుది జాబితాను అధికారికంగా విడుదల చేస్తారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
గడివేముల	16,529	16,972	03	33,504
పాణ్యం	17,553	18,561	22	36,136
ఓర్వకల్లు	22,903	23,790	13	46,706
కల్లూరు	93,910	97,741	38	1,91,689

అర్హులందరికీ ఓటు హక్కు



అర్హత కలిగిన వారంతా డిసెంబర్ 9వ తేదీ వరకూ కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి. బీఎల్‌ఓలకు దరఖాస్తులు అందజేస్తే.. విచారించి ఓటరుగా నమోదు చేస్తాం. తాజాగా విడుదలైన ముసాయిదాలోనూ చేర్పులు, మార్పులు ఏమైనా ఉంటే.. సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇది ముసాయిదా ఓటరు జాబితా మాత్రమే. వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన తుది జాబితా ప్రదర్శన ఉంటుంది.

– శ్రీనివాసులు, తహసీల్దార్, గడివేముల